క్లుప్తంగా

ఎస్‌బీఐ సేవలపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని తిలక్ రోడ్డు, గాంధీ రోడ్డులో వ్యాపారాలు సాగిస్తున్న ఎస్‌బీఐ ఖాతాదారులకు తమ బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎస్‌బీఐ మంజూరు చేస్తున్న వివిధ రుణాల గురించి సమాచారంతో కూడిన కరపత్రాలను వ్యాపారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సర్కిల్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్ , సీజీఎం సీసీ ఏఎస్ పాల్, జీఎం సంజయ్ కుమార్, డీజీఎం లేఖా మీనన్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంతో అధిక ఆదాయం

రామచంద్రాపురం: రైతులు సమగ్ర వ్యవసాయం విధానాలను అనుసరిస్తే అధిక దిగుబడి, ఆదాయం పొందవచ్చని ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త ఏఆర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని మిట్టూరులో పంట పొలాలను రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమగ్ర వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ సాగు చేస్తున్న రైతు పురుషోత్తం నాయుడుకు చెందిన డ్రమ్‌సీడర్‌తో విత్తిన వరి, వేరుశెనగ విత్తనోత్పత్తి కేంద్రం, కొబ్బరి పశుగ్రాసం, పాడి పశువుల పోషణ, గోబర్ గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, దివ్య, రాముకుమార్ పాల్గొన్నారు.

టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూలో పనిచేస్తున్న ఎన్ఎంఆర్‌లను టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని వీసీ అప్పారావుకు బుధవారం వర్సిటీ హాస్టల్ ఎన్ఎంఆర్ అసోసియేషన్ నాయకులు విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి చాలీచాలని జీతాలతో జీవనం సాగిస్తున్నామన్నారు. వీసీ తమ బాధలను సావధానంగా విన్నారని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, గౌరవాధ్యక్షుడు విశ్వనాథ్, ఏఐటీయూసీ నాయకులు బండి చలపతి, వై.రాజా, ఎన్ఎంఆర్ యూనియన్ నాయకులు రాజశేఖర్, సుధాకర్, హేమగిరి, బాలాజీ పాల్గొన్నారు.

బడ్జెట్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న భాగ్యతేజ

తిరుపతి కల్చరల్: స్థానిక న్యూబాలాజీ కాలనీలో బుధవారం పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో బడ్జెట్–2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. చార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ మాట్లాడుతూ ముద్ర రుణాల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు పెంచారని వెల్లడించారు. భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు నిధులు పెంచడం శుభపరిణామమన్నారు. స్పెషల్ ప్రొటక్షన్ ఫోర్స్ ఎస్పీ రామచంద్రరాజు మాట్లాడుతూ సామాన్య ప్రజలు బడ్జెట్‌పై పెద్దగా ఆసక్తి చూపరని తెలిపారు. అనంతరం అధ్యాపకులు మల్లేశ్వరరావు, రచయిత్రి శశి తన్నీరును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ఐ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్‌రావు, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, సహాయ కార్యదర్శి సాయికుమార్‌రెడ్డి, సభ్యులు ఆర్‌సీకే రాజు. మధుసూదన్, రాజేష్, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, ఆచార్య త్రిపురసుందరి పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్: అభినయ ఆర్ట్స్ జాతీయ స్థాయి నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా బుధవారం మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు, పౌరాణిక, సాంఘిక నాటక ప్రదర్శనలు అలరించాయి. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగిన పోటీల్లో సుమారు 180 మంది కళాకారులు పాల్గొన్నారు. నాటక, నృత్య ప్రదర్శనలు ఇచ్చిన కళాకారులను అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్యదర్శి బీఎన్ రెడ్డి సత్కరించారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

తిరుపతి తుడా : తిరుమలలో బుధవారం పాముకాటుకు గురైన ఓ వ్యక్తి తిరుపతి రుయా ఆస్పత్రిలోచికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే చనిపోయాడంటూ మృతుడి కుటుంబీకులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. రుయాకు వచ్చేసరికే అతడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వివరించడంతో వారు ఆందోళన విరమించారు.

కార్యాలయంలోని గదుల్లో నెర్రెలు తీసిన గోడలు







గోడలు ఊగుతూ.. పెచ్చులు ఊడుతూ..!

గట్టిగా గాలి వీస్తే చాలు గోడలు ఊగుతుంటాయి.. ఏదైనా పెద్ద శబ్దం వస్తే చాలు శ్లాబ్ నుంచి పెచ్చులు ఊడిపడుతుంటాయి.. అజాగ్రత్తగా అడుగు వేస్తే చాలు పగిలిన టైల్స్ ముక్కలు కాళ్లను చీల్చేస్తుంటాయి.. ఇదీ తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయ భవనం దుస్థితి. ఎప్పుడు ఎవరి మాడు పగులుతుందో తెలియని పరిస్థితుల్లో ఇక్కడి సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ధారాపాతంగా ఉరుస్తుండడంతో తడిసి ముద్దవుతున్నారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో చేసేది లేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయం భయంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలోనే వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు సైతం గాయాలపాలవుతున్నారు.

- శిథిలావస్థలో రెవెన్యూ భవనం
- అడుగడుగునా పగుళ్లతో అధ్వానంగా రూరల్ తహసీల్దార్ కార్యాలయం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు
- ఏమరుపాటుగా ఉంటే తప్పని రక్తగాయాలు



తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయ భవనం పరిస్థితి దయనీయంగా ఉంది. రెవెన్యూ రికార్డుల్లో ఈ స్థలం గుంతగా నమోదై ఉండేది. అలాంటి చోట 2008లో ఈ కార్యాలయం నిర్మించారు. అయితే నాణ్యతాప్రమాణాలు పాటించకపోవడంతో నిర్మించిన ఐదేళ్లకే ఈ భవనం భూమిలోకి కుంగింది. దీంతో గోడలు నెర్రెలు తీశాయి. పలుచోట్ల పగుళ్లు వచ్చాయి. తలుపులు, ద్వారాలు కూడా కిందకు వంగిపోయాయి. కంప్యూటర్ గది, సర్వేయర్ల రూమ్, హాలులోనూ భారీ పగుళ్లు పడ్డాయి. దీంతో భారీ గాలుల వస్తే గోడలు ఊగిపోతున్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. కొద్దిపాటి వర్షాలకు సైతం భవనం ఉరుస్తోందని వెల్లడిస్తున్నారు.

తహసీల్దార్ గదిలో గుంత..!

గోడలకు పగుళ్లు వచ్చి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి ఒకవైపు ఉంటే తహసీల్దార్ గదిలో ఇంకో ప్రమాదం ఉద్యోగులను, అర్జీదారులను భయాందోళనలకు గురిచేస్తోంది. తహసీల్దార్ గదిలోకి ప్రవేశించే గుమ్మం ముందు టైల్స్ లేచిపోయి పెద్ద గుంట ఏర్పడింది. పగిలి, పైకి లేచిన టైల్స్‌ను అలాగే వదిలేశారు. దీంతో ఇప్పటికే పలువురు అర్జీదారుల కాళ్లకు అవి గుచ్చుకుని రక్తగాయాలయ్యాయి. మరికొందరు ఉద్యోగులు సైతం గాయపడ్డారు. అర్జీ ఇవ్వడానికి వచ్చి ఆస్పత్రి పాలు కావాల్సి వచ్చిందని బాధితులు వాపోతున్నారు.



కార్యాలయంలోకి ప్రవేశించే తలుపు వద్ద ప్రమాదకరంగా గోడ



తహసీల్దార్ గదిలో పగిలిన ఫ్లోరింగ్

పట్టించుకునే వారు కరువై..

కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనంలో నిత్యం భయాందోళనల మధ్య ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. అర్జీదారులు సైతం భయం...భయంగా లోపలికి రావాల్సిన దుస్థితి. ఏడాదిగా రోజు రోజుకు మరింత శిథిలమవుతున్న కార్యాలయ భవనం పరిస్థితిపై కలెక్టర్, ఆర్డీఓకు పలుమార్లు ఇక్కడి అధికారులు విన్నవించారు. అయినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో కొత్త భవనం నిర్మించాలని, లేకుంటే మరమ్మతులు అయినా చేయించాలని కార్యాలయ సిబ్బంది కోరుతున్నారు. ప్రమాదం జరగకముందే పట్టించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మరి జిల్లా అధికారులు వారి విన్నపాలను వింటారో.. యధావిధిగా పక్కన పెడతారో చూడాల్సి ఉంది. దీనిపై రూరల్ తహసీల్దార్ మహబూబ్‌చాంద్ వివరణ కోరగా.. భవనం పరిస్థితి ఇబ్బందికరంగానే ఉందన్నారు. ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. సమస్య తీవ్రతను సమగ్రంగా వివరించి తగు చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఎస్ఎస్‌డీ టోకెన్ కౌంటర్ల తనిఖీ



అధికారులకు సూచనలిస్తున్న జేఈఓ గౌతమి

తిరుపతి(అలిపిరి): తిరుపతిలో శ్రీవారి భక్తుల కోసం టీటీడీ కేటాయిస్తున్న టైమ్ స్లాట్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్ల కౌంటర్లను జేఈఓ గౌతమి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. శ్రీనివాసంలోని ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ కౌంటర్లు, క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం విష్ణు నివాసంలోని గదుల కేటాయింపు, ఎస్ఎస్‌డీ టోకెన్ల కౌంటర్లు, క్యూలైన్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ నాగేశ్వరరావు, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, వీజీఓ బాలిరెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, డిప్యూటీ ఈఓలు పార్వతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లు



ఎలక్ట్రిక్ వాహనాలు విరాళంగా అందజేస్తున్న దాతలు

తిరుమల: కోల్‌కతాకు చెందిన మోటోవోల్ట్ సీఈవో తుషార్ చౌదరి బుధవారం రూ.2.45 లక్షల విలువైన రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లను టీటీడీకి విరాళంగా అందించారు. ఈ మేరకు శ్రీవారి ఆలయం ఎదుట జేఈవో వీరబ్రహ్మంకు ఆ కంపనీ ప్రతినిధులు స్కూటర్ తాళాలు అందించారు. ఈ కార్యక్రమంలో తిరుమల డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంపై శిక్షణ

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశు వైద్య విద్య, సమాచార కేంద్రం, హైదరాబాదుకు చెందిన నార్మ్ సంస్థ ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకంపై మూడు రోజుల పాటు జరిగే రైతు నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ సీహెచ్ శ్రీలత మాట్లాడుతూ నేటి సమాజంలో పెరటికోళ్లకు మంచి డిమాండు ఉందని, మెలకువలు తెలుసుకుంటే మంచి లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత మహిళల రైతులు శిక్షణ కార్యక్రమానికి హాజరై నిపుణులు ఇచ్చే సలహాలను పాటించాలని సూచించారు. అనంతరం శిక్షణకు సంబంధించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ సుజాత, ప్రధాన శాస్త్రవేత్త ఎం బాలక్రిష్ణన్, ఎస్ షకీలా, తిరుపతిరెడ్డి, కే జయశ్రీ పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థులకు ఓరియెంటేషన్

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు బుధవారం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ ప్రొఫెసర్ టి.సునీల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో రాణించి ఉన్నత ఆశయాల కోసం కృషి చేయాలని సూచించారు. విద్య, క్రీడలు, ఇంటర్వ్యూల ప్రిపరేషన్‌లో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత లక్ష్యాల సాధనే ఆయుధాలు ముందుకు సాగాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ గంగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టుసాధించాలన్నారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు నిపుణులైన అధ్యాపకులు ఉన్నారని, అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాధమునిరెడ్డి, డీన్ మురుగేష్, కె.రమ్య, రామచంద్ర పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు, కళాశాల యాజమాన్యం

పన్నులపై అవగాహన అవసరం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : పన్నులపై చార్టెడ్ అకౌంట్స్ విద్యార్థులు, ట్యాక్స్ చెల్లింపుదారులు పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని తిరుపతి కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్స్ దుర్గేశ్ స్వామాట్ సూచించారు. బుధవారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో ఆదాయపు పన్నుశాఖ, తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ఇన్‌కమ్ టాక్స్ ఔట్రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు పన్ను చెల్లింపు శ్లాబ్‌లపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సమాజాభివృద్ధి కోసం సక్రమంగా పన్నులు చెల్లించాలని కోరారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ అప్పారావు మాట్లాడుతూ పన్ను చెల్లింపు ప్రక్రియలో ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలను ఇన్‌కమ్‌ట్యాక్స్ అధికారులు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ టీవీ వంశీధర్, చార్టెడ్ అకౌంటెంట్లు ఫల్గుణ కుమార్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికే అధిక ప్రాధాన్యం

తిరుపతి తుడా: తిరుపతి నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యమివ్వనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య స్పష్టం చేశారు. బుధవారం ఈ మేరకు ఆమె కమిషనర్‌తోపాటు తిరుపతి స్మార్ట్ సిటీ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కౌన్సిల్ సహకారంతో అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని విభాగాల అధిపతులతో జరిగిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ సమష్టిగా పనిచేసి ప్రజలకు సేవలందించాలని కోరారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, ఉప కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, అధికారులు సేతుమాధవ్, కేఎల్ వర్మ, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం , వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్రరెడ్డి, హార్టి కల్చర్ ఆఫీసర్ హరికృష్ణారెడ్డి, మెప్మా కృష్ణవేణి పాల్గొన్నారు.



మేయర్ శిరీషను కలిసిన కమిషనర్

మేయర్‌ను కలిసిన కమిషనర్

మేయర్ శిరీషను నూతన కమిషనర్ మౌర్య మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

● కలెక్టర్‌ను కలిసిన జేసీ, కమిషనర్





కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న జేసీ శుభం బన్సల్, కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య



జేసీకి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఆర్ఓ పెంచల కిషోర్ తదితరులు

తిరుపతి అర్బన్ : జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన నారపురెడ్డి మౌర్య ఈ మేరకు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈక్రమంలోనే డీఆర్ఓ పెంచల కిషోర్, కలెక్టరేట్ ఏఓ జయరాములు, సివిల్ సప్లయి జిల్లా అధికారి రాజా రఘువీర్, సివిల్ సప్లయి మేనేజర్ వై. సుమతి తదితరులు జేసీ శుభం బన్సల్‌కు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి సేవలో పీఠాధిపతి

తిరుమల: ఉడిపిలోని పాలిమరు మఠం పీఠాధిపతి విద్యా దిశ తీర్థ స్వామీజీ, విద్యా రాజేశ్వర తీర్థ స్వామి బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తిరుమల బేడీ ఆంజనేయ స్వామి వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



శ్రీవారి ఆలయ ధ్వజస్తంభం వద్ద పీఠాధిపతితో టీటీడీ అధికారులు

మార్కెట్‌లోకి 'ఎల్‌జీ ఓఎల్ఈడీ టీవీ'



ఓఎల్ఈడీ టీవీని ఆవిష్కరించిన సంస్థ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : ఎయిర్ బైపాస్ రోడ్డులోని సోనోవిజన్ షోరూమ్‌లో బుధవారం సాయంత్రం ఎల్‌జీ ఓఎల్ఈడీ టీవీని తిరుపతి బ్రాంచి మేనేజర్ శివాజీ, ఏరియా మేనేజర్ జ్ఞానశేఖర్, స్టోర్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎల్‌జీ రీజనల్ బిజినెస్ హెడ్ కృష్ణాజీ మాట్లాడుతూ నూతన ఓఎల్ఈడీ టీవీలో 42 నుంచి 83 ఇంచెస్ వరకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. దీని ధర రూ.1,19,000 నుంచి రూ.5,25,000 వరకు వివిధ ధరల్లో లభిస్తుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాషువా రచనలు అజరామరం

తిరుపతి కల్చరల్ : కుల వివక్షపై కలంలో గర్జించిన గుర్రం జాషువా రచనలు అజరామరమని ఏపీ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు కొనియాడారు. సమితి జిల్లా కమిటీ వారు బుధవారం బైరాగిపట్టెడలోని పిల్లపాళెం వాసుదేవరెడ్డి గ్రంథాలయంలో గుర్రం జాషువా 53వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ జాషువా అనేక అవమానాలు ఎదుర్కొని తన రచనలతో కవిత్వాలతో ముందుకు సాగారని వెల్లడించారు. ఆర్‌పీఐ రాష్ట్ర నేత పి.అంజయ్య మాట్లాడుతూ తిరుపతిలో జాషువా విగ్రహ ప్రతిష్టకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్నం పెంచలయ్య, ధనశేఖర్, ఎస్. నాగరాజు, చిన్నం కాలయ్య, పరమేశ్వరరావు, నడ్డి నారాయణ, ప్రసాద్‌రావు, దామోదరం, తులసిరామ్, డాక్టర్ బలరాం, ఎన్.శ్రీరాములు పాల్గొన్నారు. అలాగే వేమన విజ్ఞాన కేంద్రం, ఎస్‌కేఆర్‌ఎస్ ఇంగ్లీషుమీడియం స్కూల్ ఆధ్వర్యంలో జాషువా వర్ధంతి సభ నిర్వహించారు. గరికపాటి రమేష్‌బాబు మాట్లాడుతూ దళిత సాహిత్యానికి జాషువా దార్శనికుడని కొనియాడారు. ఎం.సురేంద్ర, మల్లారపు నాగార్జున, నడ్డినారాయణ, గురునాథం, మహేష్ పాల్గొన్నారు. గుర్రం జాషువాకు రాయలసీమ రంగస్థలి కళాకారులు నివాళులు అర్పించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి, కేఎస్ రాజా, పద్మనాభం, రవి ప్రసాద్, సుబ్రమణ్యం రెడ్డి, పణిభూషణరెడ్డి పాల్గొన్నారు.



జోహార్లర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

డిస్కౌంట్ ధరలకే ఆప్కో వస్త్రాలు

తిరుపతి కల్చరల్ : ఆప్కో షోరూమ్‌లో 35 శాతం నుంచి 50 శాతం వరకు ఎంపిక చేయబడిన వస్త్రాలపై డిస్కౌంట్‌తో విక్రయాలు చేస్తున్నట్లు ఆప్కో మండల వాణిజ్యాధికారి ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం గాంధీ రోడ్డులోని ఆప్కో షోరూమ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆషాడ మాసంతో పాటు సంక్రాంతి వరకు ఆప్కో మెగా షోరూమ్‌లలో డిస్కౌంట్ ధరలకు విక్రయాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు, చిత్తూరులోని ఆప్కో షోరూమ్‌లలో ఎగ్జిబిషన్ ద్వారా సరికొత్త డిజైన్లలో వస్త్రాలను అందిస్తున్నామని వివరించారు.



మాట్లాడుతున్న ఆప్కో అధికారి కోటేశ్వరరావు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఇటీవల జరిగిన నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలలో గెలుపొందిన 32 మంది నూతన సభ్యులు వర్సిటీ సెనేట్ హాల్‌లో బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో అధ్యక్షుడు గుర్రంకొండ శ్రీధర్, సెక్రటరీ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. వర్సిటీ అభివృద్ధిలో భాగస్వామ్యులైన ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలిస్తుందనే నమ్మకం ఉందన్నారు. అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో భారీ మెజారిటీతో తమను గెలిపించినందుకు ప్రతి ఉద్యోగికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పీకే సుబ్రమణ్యం, జాయింట్ రిజిస్ట్రార్ చంద్రయ్య, వర్సిటీలోని పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వాయిదా పడిన వేలం

పాకాల : స్థానిక పంచాయతీ పరిధిలోని వనరుల బహిరంగ వేలం వాయిదా పడింది. బుధవారం సర్పంచ్ ఎస్.కస్తూరి అధ్యక్షతన ఈఓ మోతీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. వారపుసంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతు వధశాలలకు సర్కారు పాట ఎక్కువగా ఉందని వేలం పాటదారులు ఆసక్తి చూపలేదు. దీంతో వేలం వాయిదా పడింది. ఈ క్రమంలోనే పంచాయతీ అద్దె రూములు మూడింటిని రూ.3,750, రూ.3,150,రూ.4,150 చొప్పున వేలం వేశారు. చింతచెట్లు రూ.3,500, కొబ్బరి చెట్లు రూ.3,600లకు వేలం వేసినట్లు ఉప సర్పంచ్ ప్రకాష్‌రెడ్డి వెల్లడించారు.